సమావేశంలో మాట్లాడుతున్న కేడీసీసీ డైరెక్టర్ రవీందర్‌గౌడ్

పదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి

చిరు ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి ■ మెజారిటీ రైతుల అభిప్రాయం

హనుమకొండ సబర్బన్, జూలై 3 : రైతు భరోసా పథకాన్ని పదెకరాల వరకు భూమి ఉన్న వారికీ ఇవ్వాలని మెజారిటీ రైతులు అభిప్రాయపడ్డారు. బుధవారం ఎల్కతుర్తిలోని రైతువేదికలో ఈ పథకంపై కేడీసీసీ డైరెక్టర్ శ్రీపతి రవీందర్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. డీఏవో బొందిలి రవీందర్ సింగ్, నోడల్ అధికారి మనోహర్ హాజరయ్యారు. రెండెకరాలు ఉన్న రైతులూ ఇప్పుడు గృహ నిర్మాణానికో లేదా పిల్లల్ని ఇతర దేశాలకు పంపించేందుకో ఐటీ చెల్లిస్తున్నారని, అలాంటి వారికి వారి ఆర్థిక స్థితిని చూసి రైతు భరోసా ఇవ్వాలన్నారు. ఇక తక్కువ వేతనం తీసుకునే చిన్న స్థాయి ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని కొందరు చెప్పారు. పనికి రాని, సాగు కాని భూములకు రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదని ముక్తకంఠంతో చెప్పారు. అయితే ప్రభుత్వం ఇవ్వాలనుకుంటున్న డబ్బులను నిర్దిష్ట సమయంలో ఇస్తే రైతుకు ధీమాగా ఉంటుందని చెప్పారు. ఎన్నికల హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతుల విషయంలోనూ ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలోవైస్ ఎంపీపీ తంగెడ నగేశ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, డైరెక్టర్లు ముప్పు మహేందర్, శ్రీనివాస్, రాజిరెడ్డి, చెవుల కొమురయ్య, మాజీ సర్పంచ్‌లు గుండా ప్రతాపరెడ్డి, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలి

హనుమకొండ చౌరస్తా, జూలై 3 : నీట్ పేపర్ లీకేజీ ఘటనకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, లీకేజీపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించాలని ఎల్‌హెచ్‌పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ అన్నారు. బుధవారం హనుమకొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ 4న విద్యార్థి సంఘాలు ఇచ్చిన కేజీ టు పీజీ దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బాదావత్ భాస్కర్, బానోత్ రాజ్‌కుమార్, విజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి..

నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ జూలై 4న దేశవ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి తిరుపతి పిలుపునిచ్చారు. కుమార్‌పల్లిలో డీవైఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాల వల్ల విద్యార్థులు నష్టపోయినా ప్రధాని మోదీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నాయకులు మాటూరి సతీశ్, రవితేజ, రాజేందర్, అశోక్, అనిల్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులు చెల్లించాలని బాధితుల ధర్నా

వరంగల్, జూలై 3 : బాకీ ఎగ్గొట్టి బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని అప్పులు ఇచ్చిన బాధితులు ధర్నాకు దిగారు. బుధవారం కాకతీయ టాకీసు సమీపంలోఅప్పులు తీసుకుని నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని నిలిపివేయాలని బాధితులు ఆందోళన చేశారు. సుమారు 50 మంది బాధితులు వచ్చి నిర్మాణాన్ని నిలిపి వేయాలని భవన నిర్మాణానికి బ్యానర్ కట్టారు. ఇమ్మడి మధుకర్, అంచూరి సంతోష్ అప్పులు చెల్లించడం లేదని బాధితులు వాపోయారు. చివరికి మట్టెవాడ పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఉరేసుకొని ఒకరి మృతి

సంతోష్ (ఫైల్)

ఐనవోలు, జూలై 3 : ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన అన్నెపు సంతోష్(33) బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. అతడికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

వ్యవసాయ భూమి అమ్మబడును

★12ఎ|| తరి పొలము, 10ఎ|| రాగడి, వీటికి నీటి సౌకర్యం కలదు. ముస్త్యాలపల్లి గ్రామం, నడికూడ మం||, హనుమకొండ జిల్లా. ఆసక్తి గల వారు సంప్ర: పి.వసంత కుమార్ రెడ్డి, సెల్: 9652225908
NTW-323325

CHANGE OF NAME

★I, BINGI BHAGYALAKSHMI (Old Name), W/O. GUNDU KAMESHWAR, R/O. H.No. 11-23-250, L.B.Nagar, Adarsha Veedhi, Warangal. That have changed my name as GUNDU BHAGYALAXMI (New Name), W/O. GUNDU KAMESHWAR.
NTW-0405

PLOT FOR SALE

★1089 గజముల ప్లాట్, సర్వే నెం. 187, L.R.S. కూడా కట్టబడినది. దర్గా గ్రామం, కాజీపేట మండలం, ఆసక్తి గల వారు సంప్ర: పి.వసంత కుమార్ రెడ్డి, సెల్: 9652225908
NTW-323326

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమీషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

ఐదేళ్లలో ప్రగతి పాలన

- కలెక్టర్ ప్రావీణ్య అభినందన
- అత్యుత్తమ సేవలందించిన ప్రజాప్రతినిధులు : అదనపు కలెక్టర్ రాధికాగుప్తా
- పదవి ఉన్నా, లేకున్నా ప్రజల కోసం పనిచేయాలి : జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, జూలై 3 : వరంగల్ అర్బన్ జడ్పీ పాలక మండలి జిల్లాను ఐదేళ్లలో ప్రగతి పథంలో నడిపించిందని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గురువారంతో జడ్పీ గడువు ముగియనున్న నేపథ్యంలో బుధవారం జడ్పీ సీఈవో విద్యాలత అధ్యక్షతన నిర్వహించిన పాలక మండలి ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాలకవర్గ సభ్యులు ఆయా గ్రామాల ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేందుకు కృషి చేశారని తెలిపారు. జడ్పీ చైర్మెన్ సుధీర్‌కుమార్ ప్రతి ఒక్కరిని మంచి మనుసుతో పలకరిస్తూ, ఎలాంటి ఇబ్బందులు రాకుండా జడ్పీ పాలన సాగించారన్నారు. అదనపు కలెక్టర్ రాధికా గుప్తా మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించారన్నారు. జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. పదవులు వస్తాయి.. పోతాయని వాటి గురించి బాధ పడాల్సిన పని లేదన్నారు. పొగడ్తలకు పొంగిపోవద్దని అలాగే విమర్శలకు కుంగి పోవద్దన్నారు. ఎదిగినకొద్ది ఒదిగి ఉండాలని, తాను కూడా అదే సూత్రాన్ని పాటిస్తానని తెలిపారు. ప్రభుత్వాలు మారినా, పదవులు ఉన్నా.. లేకున్నా పార్టీలకతీతంగా ప్రజలకు సేవ చేయాలన్నారు. ప్రజాప్రతినిధులుగా ప్రజలకు కోసం ఏం చేశాం.. చేస్తామనేది పునఃపరిశీలన చేసుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో ప్రజల కోసం ప్రజలే కేంద్రంగా పని చేసిందన్నారు. కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయడంతోనే ఈ ఐదేళ్ల కాలంలో సక్సెస్‌ఫుల్‌గా ప్రభుత్వ పథకాలను ప్రజలను అందించడంలో ముందున్నామని తెలిపారు. జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, జడ్పీటీసీలు మాట్లాడుతూ.. తామంతా ఒక కుటుంబంలా కలిసి ఉంటూ పని చేశామన్నారు. జడ్పీ సీఈవో విద్యాలత మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా నుంచి బదిలీ అయిన భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాలతో పాటు ధర్మసాగర్, ఐనవోలు, హసన్‌పర్తి, వేలేరు మండలాలతో వరంగల్ పట్టణ జిల్లా పరిషత్‌ను 2019లో ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుత పాలకవర్గ హయాంలో 22 సర్వసభ్య సమావేశాలు, 23 స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించామని తెలిపారు. కారుణ్య నియామకాల కింద 54 మందికి ఉద్యోగావకాశాలు, 79 మంది ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించామని పేర్కొన్నారు. అలాగే 279 అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. 15వ ఫైనాన్స్ నిధులు రూ. 3,73,03,000లతో 163 పనులు, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ రూ.1,31,82,000 లతో 57 పనులు, స్పెషల్ గ్రాంట్ రూ.1.73 కోట్లతో 59 అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అనంతరం జడ్పీ పాలకవర్గాన్ని సన్మానించారు. సమావేశంలో జడ్పీటీసీలు వంగ రవి, చాడ సరిత, పిట్టల శ్రీలత, సునీత, లాండిగ కల్యాణి, బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

బాలల సంరక్షణ సామాజిక బాధ్యత : సీపీ

సుబేదారి, జూలై 3 : బాలల సంరక్షణ సామాజిక బాధ్యత అని సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. బాలల వెట్టి చాకిరీ విముక్తి కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వరంగల్ కమిషనరేట్‌లో బాల కార్మికులు, వేధింపులకు గురవుతున్న పిల్లలను వెంటనే గుర్తించాలన్నారు. వరంగల్, జనగామ జిల్లాల బాలల సంరక్షణ సమితి చైర్మన్లు దామోదర్, వసుధ పాల్గొన్నారు.

ట్రాఫిక్ జంక్షన్ల పరిశీలన..

హనుమకొండలోని ట్రాఫిక్ జంక్షన్లను సీపీ పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలతో మర్కజీ స్కూల్ నుంచి కుమార్‌పల్లి మార్కెట్ వైపు వెళ్లే మార్గాన్ని పునఃప్రారంభించాలని ట్రాఫిక్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత సీపీ అదాలత్ జంక్షన్‌ను పరిశీలించారు. వాహనదారులకు కనిపించేలా కొత్త ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సీఐలు సత్యనారాయణ, షుకూర్, నాగబాబు, హనుమకొండ సీఐ సతీశ్ ఉన్నారు.

ఆస్తి ఇప్పిస్తానని మోసం

సుబేదారి, జూలై 3 : భర్తకు రావాల్సిన ఆస్తి ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి మోసం చేసి రూ.6.50లక్షలు, 6తులాల బంగారం తీసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు బాధితురాలు సీపీ అంబర్ కిశోర్ ఝాకు ఫిర్యాది చేసింది. బాధితురాలు తోటకూరి లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా సంగెం మండలం కాపులకనిపర్తికి చెందిన మాజీ సర్పంచ్ చక్రపాణి రెండో భార్య. భర్త చనిపోవడంతో మొదటి భార్య కుమారులతో గొడవ కారణంగా కూతురుతో హనుమకొండలో నివాసం ఉంటోంది. కాపులకనిపర్తికి చెందిన జంగిలి రాజు ద్వారా వరంగల్ కరీమాబాద్‌కు చెందిన బండి సుభాష్ బాధితురాలు లక్ష్మికి భర్తనుంచి రావాల్సిన ఆస్తి ఇప్పిస్తానని నమ్మించాడు. ఆమె నుంచి రెండు దఫాలుగా రూ.6.50లక్షలు, ఆరు తులాల బంగారం తీసుకున్నాడు. ఆపై పని చేయకుండా తనపై లైంగికంగా వేధిస్తున్నాడని లక్ష్మి సీపీకి ఫిర్యాదు చేసింది.

ఒలింపియాడ్‌లో అనికేత్‌కు గోల్డ్ మెడల్

విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందిస్తున్న హెచ్ఎం జయప్రతాప్‌రెడ్డి

న్యూ శాయంపేట, జూలై 3 : ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో రాచర్ల అనికేత్‌కు గోల్డ్ మెడల్ లభించింది. సిల్వర్ జోన్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి నిర్వహించిన పరీక్షలో కాజీపేట ఫాతిమానగర్‌లోని బిషప్ బెరెట్టా హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న అనికేత్ ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు జయప్రతాప్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయిలో 219వ ర్యాంకు, సౌత్ జోనల్ స్థాయిలో 6,984 ర్యాంకు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గోల్డ్ మెడల్‌తో పాటు సర్టిఫికెట్ ప్రదానం చేసినట్లు తెలిపారు.

భూకబ్జాకు యత్నం

హైకోర్టును ఆశ్రయించిన కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ

హనుమకొండ చౌరస్తా, జూలై 3 : హనుమకొండ కాకాజీ కాలనీలోని సర్వే నంబర్ 1103లో మిక్కిలినేని సీతారామయ్య, మిక్కిలినేని వర్షిణి, స్వయంభూ జలేశ్వరాలయ శివాలయం పక్కన ఉన్న భూమిని కబ్జా చేయడానికి యత్నించారని కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ కన్వీనర్ చీకటి రాజు, ఆలయ పరిరక్షణ కమిటీ చైర్మన్ మట్టా శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇక్కడ ప్రభుత్వ తవ్వకాల్లో కాకతీయ కాలం నాటి స్వయంభూ శివలింగం బయటపడిందని, అప్పటి నుంచి ఇక్కడ భక్తులు పూజలు నిర్వహిస్తున్నారన్నారు. కాగా, ఈ భూమి పరిసర ప్రాంతాల్లో అక్రమంగా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీంతో హైకోర్టును ఆశ్రయించామన్నారు. హైకోర్టు ప్రభుత్వం సహ ప్రైవేట్ వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు చీకటి రాజు తెలిపారు.

6 నుంచి భద్రకాళీ శాకంబరీ ఉత్సవాలు

కరపత్రం ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఉత్సవాల కరపత్రాన్ని అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్, జూలై 3 : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ అలయంలో ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే భద్రకాళీ శాకంబరీ నవరాత్రి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఆలయ అధికారులు, అర్చకులతో కలిసి శాకంబరీ నవరాత్రి మహోత్సవాల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 6 నుంచి 21 వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తామన్నారు. మొదటి దశ మాడ వీధుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రెండు, మూడు దశల్లో నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. ఆలయ ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు మాట్లాడుతూ.. 21న భద్రకాళీ అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఆలయ ఈవో శేషుభారతి మాట్లాడుతూ.. ఉత్సవాల నేపథ్యంలో ప్రతి రోజూ ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయకుమార్, మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధిపై నేడు మంత్రి పొంగులేటి సమీక్ష

రెండు జిల్లాల పరిధిలోని అభివృద్ధి పనులు ఎజెండా

వరంగల్, జూలై 3 : వరంగల్ నగరాభివృద్ధిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. గురువారం హైదరాబాద్‌లో గ్రేట ర్ కార్పొరేషన్, కుడా చేపట్టిన, చేపట్టనున్న పనులపై, వరంగల్, హనుమకొండ జిల్లాల అభివృద్ధి పనులపై చర్చించనున్నారు. హనుమకొండ జిల్లా పరిధిలోని దేవన్నూరు ఎకో టూరిజం ప్రతిపాదనలపై సమీక్ష చేయనున్నారు. కాజీపేట లో రెండో ఆర్వోబీ నిర్మాణ పనులు, అయోధ్యపురం ఆర్వోబీ, వరంగల్ జిల్లా పరిధిలోని సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఈపీసీ మోడల్ కాంట్రాక్ట్ నిబంధనలు, నర్సంపేట మెడికల్ కళాశాల, ఎంజీఎం ఆస్పత్రికి నిధుల మంజూరుపై మాట్లాడనున్నారు. జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో పాటు సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్య శారదాదేవీ, ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరు కానున్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగాలి

ఐనవోలు, జూలై 3 : రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వాలు ముందుకు సాగాలని నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు అన్నారు. సొసైటీ కార్యాలయం వద్ద రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి డీసీవో నాగేశ్వర్‌రావు, ఏపీవో కవితతో కలిసి ఆమె హాజయ్యారు. ఎక్కువ శాతం రైతులు 5 ఎకరాల వరకు మాత్రమే ఇవ్వాలని వెల్లడించారు. కొందరు 10 ఎకరాలకూ ఇవ్వాలని కోరారు. రాష్ట్రం అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రైతులకు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, పనిముట్లను అందించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ ఐనవోలు బ్రాంచ్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, సొసైటీ డైరెక్టర్లు బుచ్చిరెడ్డి, చిరంజీవి, రాంచంద్రయ్య, యేసోబు, ఏలేంద్ర, సీఈవో సంపత్, సొసైటీ మాజీ చైర్మన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి

మున్సిపల్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రేటర్ ఉద్యోగ సంఘాల నాయకులు

వరంగల్, జూలై 3 : మున్సిపల్ శాఖ జూనియర్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని గ్రేటర్ ఉద్యోగ సంఘాల నాయకులు మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్‌ను కోరారు. బుధవారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం జీవో 121 ప్రకారం 2022 జూలై లో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్ఏలను మున్సిపల్ శాఖలో జూనియర్, సీనియర్, సూపరింటెండెంట్ హోదాల్లో సర్దుబాటు చేశారు. ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాలో రెవెన్యూ శాఖ నుంచి సర్దుబాటు చేసిన వీఆర్ఏల పేర్లు ఉన్నాయని, దీంతో మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు అన్యాయం జరుగుతోందని వారు ఆర్‌డీకి వివరించారు. మున్సిపల్ శాఖలో డిగ్రీ అర్హతను పరిగణలోకి తీసుకుని జూనియర్ అసిస్టెంట్ హోదా ఇస్తారని తెలిపారు. దీనిపై తమకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బల్దియా జేఏసీ నాయకులు బొట్ల రమేశ్,రాజారపు భాస్కర్, సంధ్య, సునీల్, ప్రతిభ ఉన్నారు.

ప్రజలకు సేవ చేసినప్పుడే గుర్తింపు

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, జూలై 3 : ప్రజలకు సేవ చేసినప్పుడే గుర్తింపు వస్తుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో సన్మానించి వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదేళ్లలో ప్రజలకు సేవలందించినందుకు అభినందనలు తెలిపారు. అధికారులు ప్రజల కోసం పని చేయాలని, ప్రజల సమస్యలపై సకాలంలో స్పందించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుండె బాబు, జడ్పీటీసీ కల్యాణి, ఎంపీపీ రాణి, వైస్ ఎంపీపీ శైలజ, ఎంపీటీసీలు భాస్కర్‌రావు, సంపత్‌రావు, వెంకటేశ్వర్లు, రామస్వామి, లక్ష్మి, శైలజ, రాధిక, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో సేవ చేస్తేనే గుర్తింపు : ఎమ్మెల్యే రేవూరి

పరకాల : నిబద్ధతతో సేవ చేస్తేనే మంచి గుర్తింపు పొందుతారని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. నడికూడ, పరకాల మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాల్లో పదవీ కాలం పూర్తయిన ప్రజాప్రతినిధులను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల, గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వాలు, ప్రజలకు మధ్య వారధిగా నిలిచే వారు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు అని అన్నారు. అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పని చేసే వాళ్లు మాత్రమే నిజమైన నాయకులని పేర్కొన్నారు.

భావోద్వేగంగా సాగిన సర్వసభ్య సమావేశం

ఎల్కతుర్తి : ఎంపీటీసీల పదవీ కాలం ముగియనుండగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం భావోద్వేగంగా జరిగింది. ఎంపీపీ మేకల స్వప్న అధ్యక్షతన సమావేశం ప్రారంభం కాగా, పలువురు అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ, పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ఈ ఐదేండ్ల కాలంలో అధికారులంతా తమతో కుటుంబసభ్యుల్లా కలిసి పనిచేశారన్నారు. ఇక మీదట కూడా అధికారులతో కలిసి తామంతా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తంగెడ నగేశ్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, తహసీల్దార్ జగత్ సింగ్, ఎంపీడీవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కమలాపూర్‌లో ఎంపీటీసీలతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి ఎనలేని కృషి : ఎంపీపీ శంకర్

దామెర : ఐదు సంవత్సరాల్లో గ్రామాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసినట్లు ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎంపీటీసీల వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. కొత్త మండలం ఏర్పాటుతో పాటు ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులను సమకూర్చామని చెప్పారు. వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రత్యేక చొరవతోనే దామెర మండలం, నూతన జీపీలు ఏర్పడ్డాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కల్పన-కృష్ణమూర్తి, ఎంపీటీసీలు పోలం కృపాకర్‌రెడ్డి, గోవిందు సంధ్య-అశోక్, కళ-సుధాకర్, గండు రామకృష్ణ, సంగనబోయిన మౌనిక-కిరణ్, ఎంపీడీవో కల్పన, ఎంపీవో రంగాచారి, ఏపీవో శారద, సీనియర్ అసిస్టెంట్ విష్ణు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారుల నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, జూలై 3 : ఈ నెల 3వ తేదీతో మండల పరిషత్ పాలకవర్గాల గడువు ముగిసింది. ఈ మేరకు కలెక్టర్ ప్రావీణ్య మండల ప్రత్యేకాధికారులను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా జడ్పీ పాలక మండలి గడువు సైతం ముగియనున్నది. దీంతో జడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ లేదా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించే అకాశం ఉన్నట్లు సమాచారం. భీమదేవరపల్లి మండల ప్రత్యేకాధికారిగా అదనపు డీఆర్డీవో శ్రీనివాసరావు, ధర్మసాగర్ మండల ప్రత్యేకాధికారిగా డీఆర్డీవో నాగపద్మజ, ఎల్కతుర్తికి డీసీవో నాగేశ్వర్‌రావు, హసన్‌పర్తికి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శ్రీను, ఐనవోలుకు గ్రౌండ్ వాటర్ డీడీ శ్రీనివాసరావు, కమలాపూర్‌కు బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి, వేలేరు మండల ప్రత్యేకాధికారిగా జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మల్లయ్యను నియమించారు. గురువారం జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిని నియమించే అవకాశం ఉంది.

దూరవిద్యా డిగ్రీ పరీక్షల్లో 11 మంది డిబార్

హనుమకొండ చౌరస్తా, జూలై 3 : కేయూ దూరవిద్య కేంద్రం డిగ్రీ సెకండియర్ పరీక్షల్లో 11 మంది డిబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఇద్దరు, జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆరుగురు, సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ముగ్గురు ఉన్నట్లు పేర్కొన్నారు.

బాధితులకు ఉపాధి కల్పించాలి

మడికొండ, జూలై 7 : రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ స్థాపన కోసం భూములు కోల్పోయిన రైతులకు ఉపాధి కల్పించాలని కోరుతూ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ మధుసూధన్‌రావుకు అయోధ్యపురం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. వ్యాగన్ పరిశ్రమ పనులను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను బాధితులు మర్యాద పూర్వకంగా కలిశారు. గాదెం యాదగిరి, జెర్రిపోతుల కుమారస్వామి, ఉల్లెంగుల శ్రీనివాస్, ఇలాసాగరం వీరయ్య, మామిళ్ల భిక్షపతి, మామిళ్ల మల్లయ్య ఉన్నారు.

అదనపు కమిషనర్ బాధ్యతల స్వీకరణ

మేయర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కృష్ణారెడ్డి

వరంగల్, జూలై 3 : బల్దియా ఇన్‌చార్జి అదనపు కమిషనర్‌గా కాశీబుగ్గ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి బుధవారం ప్రధాన కా ర్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. దీం తో పాటు బల్దియా ఇన్‌చార్జి కార్యదర్శి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతం కృష్ణారెడ్డి మేయర్ గుండు సుధారాణిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు

ఐనవోలు, జూలై 3 : ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించిన, హద్దు రాళ్లను తొలగించినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ విక్రమ్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రం శివారులో సర్వే నంబర్ 1150లో 1.07 గుంట లు, సర్వే నంబర్ 1163లో 0.34 గుంటల భూమిని గతంలో రాష్ట్ర ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ద్వారా కొనుగోలు చేసింది. ఈ భూమిని కొంత మంది వ్యక్తులు అక్రమించుకున్న విషయం తెలుసుకొని రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయించారు. మొత్తం 2.010 భూమికి హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వేలో ఆర్ఐ మల్లయ్య, సర్వేయర్ సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ క్రాంతి కుమార్

పరకాల, జూలై 3 : పరకాల నూతన సీఐగా వీ క్రాంతికుమార్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన రవిరాజు వీఆర్‌కు బదిలీ కాగా ఆత్మకూరు సీఐగా విధులు నిర్వర్తిస్తున్న క్రాంతి కుమార్‌ను పరకాలకు బదిలీ చేశారు.

యూపీ ఘటనకు బీజేపీదే బాధ్యత

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసరావు

నయీంనగర్, జూలై 3 : ఉత్తరప్రదేశ్‌లో తొక్కిసలాట ఘటనకు బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసరావు అన్నారు. బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీజేపీ హిందుత్వం పేరుతో ప్రజల్లో మూఢ నమ్మకాలను పెంచి పోషిస్తూ, వారి ప్రాణాలతో చెలగాటం అడుతున్నదని మండిపడ్డారు. సమావేశంలో శ్రీనివాస్, సారంగపాణి, సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి స్పోర్ట్స్ అథారిటీ కృషి

హనుమకొండ చౌరస్తా జూలై 3 : యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తిస్తూ వారిని ప్రోత్సహించడంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ముందంజలో ఉన్నదని వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్ అన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జేఎన్ఎస్‌లో బుధవారం ప్రాంతీయ క్రీడావసతి ఎంపికలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. స్పోర్ట్స్ హాస్టల్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక పతకాలను సాధించినట్లు చెప్పారు. జిల్లా క్రీడలు యువజన శాఖ అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో తొలిరోజు నిర్వహించిన ఎంపికలకు వివిధ జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. కోచ్‌లు మహ్మద్ గౌస్, స్వర్ణలత, రవికుమార్, నర్సింగ్‌రావు, రాజేశ్, సుధాకర్, సంతోష్‌చారి, ఆయుష్‌యాదవ్, జిల్లా క్రీడాశాఖ కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, విష్ణువర్ధన్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

దామెర : మండల కేంద్రంలో ఎంపీపీ కాగితాల శంకర్ మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాతావరణ కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కల్పన-కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, ఎంపీటీసీలు పోలం కృపాకర్‌రెడ్డి, గండు రాము, సంగనబోయిన మౌనిక-కిరణ్, గోవిందు సంధ్య-అశోక్, కళ-సుధాకర్, ఎంపీడీవో కల్పన, ఏపీవో శారద పాల్గొన్నారు.

ముల్కనూరులో వన మహోత్సవం

భీమదేవరపల్లి : మండలంలోని ముల్కనూరు బీసీ కాలనీలో బుధవారం వన మహోత్సవ కార్యక్రమం జరిగింది. జడ్పీటీసీ వంగ రవి, ఎంపీటీసీలు అప్పని పద్మ, బొల్లంపల్లి రమేశ్ మొక్కలను నాటారు. అనంతరం కాలనీ వాసులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరేశం, పంచాయతీ సెక్రటరీ జంగం పూర్ణచందర్, ఏపీవో కుమారస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ వంగ కృష్ణ, అప్పని భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

ఐనవోలు, జూలై 3 : కోతుల దాడిలో వృద్ధురాలి తలకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆగపాటి వెంకటలక్ష్మి బుధవారం కూలి పనికి వెళ్లేందుకు టిఫిన్ బాక్స్ పట్టుకొని ఇంటి నుంచి బయలుదేరింది. ఈ క్రమంలో చెట్టుపైన ఉన్న కోతుల గుంపు ఒక్కసారిగా వృద్ధురాలి మీద దాడి చేయగా, గాయాలయ్యాయి. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించారు.